# ఇండియన్ పాలిటీ

## రాజ్యాంగ పరిహారపు హక్కు

**"రాజ్యాంగంలో అన్నింటి కంటే ఎక్కువ ప్రాముఖ్యం ఉన్న అధికరణం ఏది అని ఎవరైనా అడిగితే నేను '32'వ అధికరణం అని సమాధానం ఇస్తాను. ఇది లేకుంటే రాజ్యాంగం నిర్వీర్యం అయిపోతుంది. ఈ అధికరణమే రాజ్యాంగానికి ప్రాణం. ఆత్మ, హృదయం". – డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్**

### 32వ అధికరణం

ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కాపాడటానికి ఈ హక్కు ఉపయోగపడుతుంది. పౌరులకు రాజ్యాంగంలోని IIIవ భాగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే ఈ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. అందుకే ఈ హక్కును రాజ్యాంగానికి ఆత్మగా అంబేడ్కర్ అభివర్ణించారు.

✪ 32వ అధికరణంతో సుప్రీంకోర్టును ప్రాథమిక హక్కులను రక్షించే ఒక విస్తృత వ్యవస్థగా రాజ్యాంగం మలిచింది. ఈ అధికరణంతో రాజ్యాంగం సుప్రీంకోర్టు ప్రారంభ అధికార పరిధిని (Original Jurisdiction of the Supreme Court) పెంచినట్లైంది.

✪ ప్రాథమిక హక్కుల అమలు కోసం సుప్రీంకోర్టు కొన్ని రిట్‌లను (Writs) జారీ చేయొచ్చు. రిట్ అంటే తప్పనిసరిగా పాటించాల్సిన కోర్టు ఆదేశం లేదా ఆజ్ఞ. రాజ్యాంగం పేర్కొన్న రిట్‌లు అయిదు. అవి...

1. **హెబియస్ కార్పస్ (Habeas Corpus):** ఇది లాటిన్ పదం. నిర్బంధించిన వ్యక్తిని/ బందీని కోర్టులో హాజరుపరచాల్సిందిగా ఇచ్చే ఆదేశం. స్వేచ్ఛా హక్కుకు (19 – 22) భంగం వాటిల్లినప్పుడు ఈ రిట్‌ను జారీ చేస్తారు.

2. **మాండమస్ (Mandamus):** దీనికి ఆంగ్లంలో We command అనే అర్థం వస్తుంది. తెలుగులో 'ఆదేశం' అని పేర్కొనవచ్చు. ఇది ఒక అధికారికి లేదా సంస్థకు తమ బాధ్యతను గుర్తుచేస్తూ కోర్టు ఇచ్చే ఆదేశం. ప్రభుత్వాధికారులు తాము చేయాల్సిన పనులను నిరాకరించినా లేదా విస్మరించినా న్యాయస్థానాలు ఈ రిట్‌ను జారీ చేయొచ్చు.

✪ ఈ రిట్‌ను పబ్లిక్ సంస్థలకు, క్వాజీ పబ్లిక్, జ్యుడీషియల్, క్వాజీ జుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా జారీ చేయొచ్చు. రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు.

3. **ప్రొహిబిషన్ (Prohibition):** సాధారణంగా దీన్ని 'స్టే ఆర్డర్' అంటారు. దిగువ న్యాయస్థానాలు తమ అధికార పరిధిని మించి వ్యవహరిస్తే వాటిని నిరోధించేందుకు ఉన్నత న్యాయస్థానం ఈ రిట్‌ను జారీ చేస్తుంది.

4. **సెర్షియోరరి (Certiorari):** సెర్షియోరరి అంటే ఉన్నత న్యాయస్థానానికి ఉన్న పరిశీలనాధికారం. దీని ప్రకారం కింది కోర్టు తాను విచారిస్తున్న కేసు తీర్పును నిలిపి, దాన్ని ఉన్నత న్యాయస్థానానికి అప్పగించాల్సి వస్తుంది.

✪ ప్రొహిబిషన్, సెర్షియోరరీ ఒకే విధంగా కనిపించినప్పటికీ ప్రొహిబిషన్ విచారణ తొలిదశలో ఉండగా జారీ అవుతుంది. సెర్షియోరరీ తీర్పు వెలువడిన తర్వాత జారీ అవుతుంది.

5. **కో – వారెంటో (Quo – Warranto):** కో – వారెంటో అంటే ఏ అధికారం/ వారెంట్ వల్ల (By what authority) అని అర్థం. ఎవరైనా చట్టరీత్యా అర్హత లేకపోయినా పదవిలో కొనసాగుతుంటే అలాంటి వారిని నిరోధించేందుకు న్యాయస్థానాలు ఈ రిట్‌ను జారీ చేస్తాయి.

✪ 2001లో TANSI భూముల కుంభకోణంలో కో వారెంటో కేసును విచారిస్తూ సుప్రీంకోర్టు జయలలితను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా ఆదేశించింది. (అప్పటికే ట్రయల్ కోర్టు జయలలితను దోషిగా తేల్చి, రెండేళ్ల శిక్ష విధించింది. రెండు సంవత్సరాలు అంతకంటే ఎక్కువ జైలుశిక్షకు గురైన వారికి ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజ్యాంగబద్ధ పదవుల్లో కొనసాగే హక్కు ఉండదు. కాబట్టి సుప్రీంకోర్టు జయలలితను పదవి నుంచి వైదొలగాల్సిందిగా రిట్ జారీ చేసింది.)

✪ 32వ అధికరణం ద్వారా సుప్రీంకోర్టుకు ప్రాథమిక హక్కులను కాపాడే విశిష్ట అధికారాన్ని రాజ్యాంగం కల్పించింది. అలాగే హైకోర్టులకు కూడా ఈ అధికరణం ద్వారా ప్రాథమిక హక్కులను కాపాడే విశిష్ట అధికారాన్ని ఇచ్చింది.



R-14-7-16

- అయితే 226వ అధికరణం ప్రకారం ప్రాథమిక హక్కుల రక్షణకే కాకుండా ఇతర హక్కుల పరిరక్షణలో భాగంగా కూడా హైకోర్టు రిట్‌లను జారీ చేయొచ్చు.
- జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు రాష్ట్రపతి ఉత్తర్వులను అనుసరించి హైకోర్టులకు 226వ అధికరణం కింద రిట్‌లను జారీ చేసే అధికారం లేదని అయిదుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది.
- 1976లో వెలువడిన ఈ తీర్పు న్యాయ వ్యవస్థపై ఇప్పటికీ మరకలాగా మిగిలిపోయింది. తీర్పు వెలువరించిన బృందంలో జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా మాత్రం తన నిరసన గళాన్ని వినిపించారు.
- పైన ఉదహరించిన కేసు ఏడీఎం, జబల్‌పూర్ Vs శుక్లా కేసు. దీన్నే హెబియస్ కార్పస్ కేసు అని కూడా అంటారు.

## 33వ అధికరణం

దేశ రక్షణ బాధ్యతలు చేపట్టే మిలటరీ వర్గాలకు, పారామిలటరీ దళాలకు, గూఢచార సంస్థలకు (IB, R & AW), రాష్ట్రాల్లో శాంతిభద్రతలను కాపాడే పోలీసులకు ప్రాథమిక హక్కులను నిర్ణయించే/ సవరించే బాధ్యతను భారత రాజ్యాంగం పార్లమెంట్‌కు ఇచ్చింది.

- ఈ అధికరణాన్ని అనుసరించి పార్లమెంట్ కొన్ని చట్టాలను రూపొందించింది.

  **ఉదా:** ఆర్మీ యాక్ట్ (1950), నేవీ యాక్ట్ (1950), ఎయిర్‌ఫోర్స్ యాక్ట్ (1950) మొదలైనవి. వీటి ఉద్దేశం రక్షణ శాఖల్లో పనిచేసేవారి భావప్రకటన స్వేచ్ఛను, యూనియన్లుగా ఏర్పడటాన్ని కొంతవరకు నిరోధించడం.

## 34వ అధికరణం

ఇది సైనిక శాసనం (Marshal Law) అమల్లో ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే విశిష్ట అధికారాల గురించి వివరిస్తుంది. సైనిక శాసనం అమల్లో ఉన్నప్పుడు శాంతిని పునరుద్ధరించే క్రమంలో పౌరులకు ఉద్యోగుల (భద్రతదళాలు) వల్ల ఏదైనా ప్రాణ, ఆస్తి నష్టం జరిగినప్పుడు ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినట్లు భావించకూడదని దీని అర్థం. అయితే ఇక్కడ సైనిక శాసనాన్ని రాజ్యాంగం నిర్వచించలేదు. Armed Forces Powers Act – 1958 ను సైనిక శాసనంగా పేర్కొనవచ్చు. ఇలాంటి చట్టాలతో కల్లోలిత ప్రాంతాల్లో రక్షణ దళాలకు ప్రత్యేక అధికారాలు సంక్రమిస్తాయి. అయితే, ఇలాంటి చట్టాల వల్ల మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందనే విమర్శ ఉంది.

- ఇరోమ్ షర్మిళ అనే మహిళ మణిపూర్‌లో AFSPA ను తొలగించాలని గత 15 ఏళ్లుగా నిరాహారదీక్ష చేస్తున్నారు. ఈమెకు ద్రవాహారాన్ని అందిస్తున్నారు.

## 35వ అధికరణం

రాజ్యాంగంలోని IIIవ భాగంలో ఉన్న అంశాలపై పార్లమెంట్‌కు ఉండే ఆధిక్యతను ఈ అధికరణం పేర్కొంటోంది. IIIవ భాగంలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం కేవలం భారత పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుందనేది ఈ అధికరణం సారాంశం.

## జాతీయ అత్యవసర పరిస్థితి విధిస్తే

358వ అధికరణం ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితి (352) ప్రకటించినప్పుడు 19వ అధికరణాన్ని (ఆరు స్వేచ్ఛలు – భావ ప్రకటన స్వేచ్ఛ, సంస్థలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ, సంఘటితమయ్యే స్వేచ్ఛ, సంచరించే స్వేచ్ఛ, స్థిరనివాసం ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ,) అనుసరించి పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించలేరు.

- 359వ అధికరణం ప్రకారం...... జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మిగతా (19వ అధికరణం తప్పనిసరిగా రద్దవుతుంది) ప్రాథమిక హక్కులను కూడా రద్దు చేసే వీలుంది.
- 44వ రాజ్యాంగ సవరణ ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిలో కూడా 20, 21వ అధికరణాలను రద్దు చేయడం కుదరదు. ఇతర హక్కులను నిలుపుదల చేయొచ్చు.

## ప్రాథమిక హక్కులు – విమర్శ

ప్రాథమిక హక్కులపై పరిమితులు, ప్రతిబంధకాలు చాలా ఎక్కువగా ఉన్నాయి అనేది ప్రధాన విమర్శ. ఉదాహరణకు 19వ అధికరణంలో ఉన్న 6 స్వేచ్ఛలపై ఎన్నో ఆంక్షలు ఉన్నాయి. ఇది ఒక చేత్తో ఇస్తూ – ఇంకో చేత్తో తీసుకున్నట్లు ఉందని విమర్శకుల అభిప్రాయం.

- హక్కుల్లో ఉపయోగించిన పదజాలాన్ని నిర్వచించకపోవడంతో కొన్ని సమస్యలు తలెత్తాయి. ఉదాహరణకు – సైనిక శాసనం, మత ప్రచారం అంటే ఏమిటో నిర్వచించలేదు. ఇలాంటివి తర్వాతి కాలంలో న్యాయ వ్యవస్థకు, కార్యనిర్వాహక వర్గానికి మధ్య అనిశ్చిత వాతావరణాన్ని సృష్టించాయి. కొన్ని పదాలను సక్రమంగా నిర్వచించకపోవడంతో ఐవర్ జెన్నింగ్స్ భారత రాజ్యాంగాన్ని న్యాయవాదుల స్వర్గంగా పేర్కొన్నాడు.
- 22వ అధికరణంలో నివారక నిర్బంధం అనే అంశం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమనే భావన విమర్శకుల్లో ఉంది. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు సమగ్రంగా లేవని, ఆర్థిక హక్కులను (ఉదాహరణకు పని చేసుకునే హక్కు, విశ్రాంతి హక్కు మొదలైనవి) చేర్చలేదనే విమర్శ ఉంది.

## మాదిరి ప్రశ్నలు

**1.** 32వ అధికరణం 'రాజ్యాంగానికి ఆత్మ' అని పేర్కొన్న వ్యక్తి ఎవరు?

ఎ) జవహర్‌లాల్ నెహ్రూ బి) సర్దార్ వల్లభాయ్ పటేల్

సి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ డి) బాబూ రాజేంద్రప్రసాద్

**2.** హైకోర్టు ఏ అధికరణం కింద రిట్‌లు జారీ చేస్తుంది?

ఎ) 200 బి) 202 సి) 226 డి) 236

**3.** ప్రభుత్వాధికారికి తన బాధ్యతను గుర్తు చేసే రిట్ ఏది?

ఎ) హెబియస్ కార్పస్ బి) ఇన్ – జంక్షన్ సి) ప్రొహిబిషన్ డి) మాండమస్

**4.** అర్హత లేకుండా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారికి వ్యతిరేకంగా జారీ చేసే రిట్‌ను ఏమంటారు?

ఎ) కో – వారెంటో బి) హెబియస్ కార్పస్ సి) మాండమస్ డి) ఇన్ – జంక్షన్

**5.** కిందివాటిలో దేన్ని 'హెబియస్ కార్పస్ కేసుగా' పేర్కొంటారు?

ఎ) జబల్‌పూర్ కేసు బి) శంకరి ప్రసాద్ కేసు

సి) చంపకం దొరైరాజన్ కేసు డి) మినర్వా మిల్స్ కేసు

**6.** రక్షణ దళాల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధిస్తున్న అధికరణం ఏది?

ఎ) 30 బి) 32 సి) 33 డి) 31

**7.** సైనిక శాసనం గురించి ప్రస్తావిస్తున్న అధికరణం ఏది?

ఎ) 34 బి) 30 సి) 28 డి) 31

**8.** AFPSA (Armed Forces Special Powers Act) కు వ్యతిరేకంగా గత 15 ఏళ్లుగా నిరాహారదీక్ష చేస్తున్న మణిపూర్ మహిళ ఎవరు?

ఎ) అరుణారాయ్ బి) ఇరోమ్ షర్మిళ సి) మేధాపాట్కర్ డి) ఊర్మిళ చనమ్

**9.** జాతీయ అత్యవసర పరిస్థితుల్లో కూడా రద్దుకాని అధికరణాలు ఏవి?

ఎ) 19, 15 బి) 20, 21 సి) 25, 26 డి) 28, 30

**10.** భారత రాజ్యాంగాన్ని న్యాయవాదుల స్వర్గంగా అభివర్ణించింది ఎవరు?

ఎ) గ్రీన్‌విల్లి ఆస్టిన్ బి) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

సి) కె.సి.వేర్ డి) ఐవర్ జెన్నింగ్స్

## జవాబులు

1–సి; 2–సి; 3–డి; 4–ఎ; 5–ఎ; 6–సి; 7–ఎ; 8–బి; 9–బి; 10–డి.

**రచయిత: జి. కళ్యాణ చక్రవర్తి**